క్లుప్తంగా

నేడు విద్యుత్ ఫీడర్ల మరమ్మతు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో నదిఅగ్రహారం రోడ్డులోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో 33కేవీ ఆయిల్‌సీడ్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు గద్వాల మండలంలోని బీరెల్లి, వీరాపురం, జమ్మిచేడు, పూడురుతో పాటు బీచుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు బీఎస్పీ ప్రజా ఆశీర్వాద సభ

అయిజ: మండల కేంద్రంలో శుక్రవారం బీఎస్పీ నాయకులు ప్రజా ఆశీర్వాదసభ నిర్వహించనున్నారు. దానికి సంబధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజా ఆశీర్వాద సభకు సంబంధించిన స్థలాన్ని, హెలీప్యాడ్ ఏర్పాటును గురువారం అలంపూర్ నియోజవకర్గం బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు కేశవరావు పరిశీలించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: పీడీఎస్‌యూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ సమక్షంలో జిల్లా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా హరీష్, ఉపాధ్యక్షుడుగా చందు, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా రవితేజ, సభ్యులుగా వంశీ, చరణ్, శేఖర్, సాయిలను ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న పీపీఆర్ టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమాన్ని నెలరోజులనుంచి కొనసాగిస్తున్నారు. మండలంలోని పర్దీపురం, చిన్నతాండ్రపాడు గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

మద్యం దుకాణాల తనిఖీ

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం పట్టణంలోని కనకదుర్గ, సూర్య, హర్షిత మద్యం దుకాణాలను ఎక్సైజ్ నోడల్ అధికారి శ్రీనివాస్‌లు తనిఖీ చేపట్టారు. మూడు నెలల నుంచి కొనుగోలు చేసిన మద్యం వివరాలు, స్టాక్ బుక్‌లో రూపొందించిన నివేదికలను, రికార్డులను వారు పరిశీలించారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన మద్యం, కల్తీ మద్యం విక్రయించిన శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి మాత్రమే మద్యం విక్రయాలు చేయాల్సిందిగా దుకాణాదారులను హెచ్చరించారు. లైసెన్స్ పొందిన వారు కాకుండా వేరే వారు మద్యం విక్రయాలు చేస్తే లైసెన్స్ రద్దుకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ తనిఖీలో సీఐ గోపాల్, సిబ్బంది ఉన్నారు.


రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి మృతి

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వృద్ధుడిని(82) రైలు ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వివరాల ప్రకారం జోగుళాంబ హాల్ట్ స్టేషన్‌లో హజ్రత్ నిజాముద్దీన్ రైలు ఢీ కొట్టింది. అతను రైలు దాటుతున్నాడా, ఆత్మహత్య చేసుకున్నారనేది తెలియలేదు.

కుక్కల దాడిలో గేదె మృతి

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాల గ్రామంలో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో గేదె అక్కడికక్కడే మృత్యువాతపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు దాడి చేయడంతో పశువులు చనిపోయిన సంఘటనలున్నాయి. గ్రామంలోని పిచ్చికుక్కల సంఖ్య పెరిగి మూగజీవాలైన, ఆవులు, లేగదూడలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పిచ్చికుక్కలను నియంత్రించకపోతే తీవ్రనష్టం వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ చైతన్యరథం అడ్డుకున్న రైతు



అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలోని లింగన్‌వాయిలో బీఆర్ఎస్ పార్టీ చైతన్య రథాన్ని రైతు అడ్డుకున్నారు. మండలంలోని లింగన్‌వాయిలో గురువారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు ప్రచారం నిర్వహించేందుకు వెళ్లగా, ఇంతవర కు రైతులకు రూణమాఫీ కాలేదని, లిఫ్ట్ ఏర్పా టు చేయలేదని గాంధీచౌక్ దగ్గర వాహనం వెళ్లకుండా అడ్డుకున్నాడు. అక్కడ ఉన్న నాయకులు ఎంత వారించినా ఆ వ్యక్తి వినకపోవడంతో కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.

మాయ మాటలకు మోసపోవద్దు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో సెల్ఫీ దిగుతున్న యువతి

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ఎన్నికలొచ్చాయంటే చాలు కొంత మంది కల్లబొల్లి మాటలు చెబుతూ మోసం చేయాలని చూస్తారు.. అలాంటి వారి మాటలకు మోసపోతే ఘోసపడడం ఖాయమని, వర్గాల సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గద్వాల పట్టణంలోని వివిధ వ్యాపార సంఘాలు, నియోజకవర్గంలోని గద్వాల, ధరూరు, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కుంభకోణాలే దర్శనమిచ్చాయన్నారు. పదేళ్లుగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలకు మోసపోతే పూర్తిగా వెనకబడిపోతామన్నారు. ప్రజలందరూ విచక్షణతో ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ను, ఇక్కడ తనను గెలిపించాలని కోరారు. ప్రజలు చేతిలోనే పట్టణ భవిష్యత్ ఉందన్నారు. గత పదేళ్లుగా గద్వాల పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకున్నామని, ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. ఎమ్మెల్యే తనయుడు సాకేత్‌రెడ్డితో కలిసి ఆయన గద్వాల పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సీఎం కేసీఆర్ అందిస్తున్న ఆసరా ఫించన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, మైనార్టీబంధు, బీసీబంధు, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే గద్వాల పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నాయకులు, కౌన్సిలర్ శ్రీను, దౌలు, మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

గట్టు: బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆరగిద్దలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్ ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. గొర్లఖాన్‌దొడ్డిలో చేనేత సంఘం అధ్యక్షుడు సిద్దప్ప ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



గద్వాల పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తనయుడు, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దు

మల్దకల్: కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎంపీపీ రాజారెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, బీఆర్ఎస్ నాయకడు పటేల్ ప్రభాకర్‌రెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని బిజ్వారం, మేకలసోంపల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ భావితరాల బంగారు భవిష్యత్ కోసం ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, సత్యారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు అవగాహన ర్యాలీ

గద్వాల అర్బన్: ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నర్సింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నవోదయ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను సీ-విజిల్‌యాప్ ద్వారా చేయాలన్నారు. అనంతరం నిర్భయంగా ఓటు వేస్తామని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల కరస్పాడెంట్ సుధాకర్, మెప్మా టీఎంసీ శ్రీకర్, సీఓ నిజాముద్దీన్, అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

మానవపాడు: ఓటు హక్కు వజ్రం లాంటిదని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. మండలంలోని పల్లెపాడు, చందూరు గ్రామాల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. డబ్బు, మద్యానికి లొంగకుండా ఓటును ఉపయోగించుకోవాలని తెలిపారు.

ధరూరు: భాతర ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశానుసారం మండలకేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ చౌరస్తాలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గ్రామంలోని పుర వీధుల గుండా ఓటరు ప్రాధాన్యతను తెలియజేస్తూ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సత్యం పాల్గొన్నారు.



ధరూరులో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ ఎండీ జబ్బార్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ రాఘవ హాజరై గ్రామస్తులకు ఓటు హక్కుపై వివరించారు. నైతిక బాధ్యతతో ఓటరుగా ఉంటూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలుపుదామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివన్న, ప్రజలు ఉన్నారు.



ధరూరులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

సరిహద్దులపై పోలీస్ ఫోకస్

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెక్‌పోస్ట్ సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలు క్షుణంగా పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు, బంగారం తీసుక్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుంటే నగదు, బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.



నందిన్నె చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పాదయాత్ర చేసి నెట్టెంపాడు సాధించాం

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

ధరూరు: ఆనాడు హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసి నెట్టెంపాడు సాధించడం వల్లే ఎడారి లాంటి నడిగడ్డ ప్రాంతం నేడు సస్యశ్యామలం అయ్యిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గురువారం మండలంలోని ద్యాగదొడ్డి, ఉప్పేరు గ్రామంలో బీజేపీ అభ్యర్థి శివారెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లలో తట్టెడు మట్టి తీయనోళ్లు నేడు గట్టు ఎత్తిపోతల గురించి మాట్లాడుతున్నారని, అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యూరియా ఇస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, కమలం గుర్తుకు ఓటు వేసి శివారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, సంజీవ్ భరద్వాజ, రాజేష్, వెంకటేశ్వరరెడ్డి, వైండింగ్ రాములు, ఉప్పేరు అంజురెడ్డి, ఆది మల్లారెడ్డి, మాశమ్మ, లక్ష్మన్న, హన్మంతరాయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివారెడ్డిను గెలిపించాలి

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో బీజేపీ నాయకులు ప్రకాష్‌రావు ఆధ్వర్యంలోని బీజేపీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కేటీదొడ్డి: బీజేపీని గెలిపిస్తే అన్ని వర్గాలకు అండగా ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నందిన్నె, గువ్వలదిన్నె, ఇర్కిచేడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రకాష్‌రావు, భీమయ్య, శ్రీపాదరెడ్డి, నాగేష్, తిరుపతి, చిన్ననాగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అభ్యర్థి వాహనం తనిఖీ

అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో సరిహద్దుల వద్ద నిరంతరం తనిఖీ చేపడుతున్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు బరిలో నిలిచిన అభ్యర్థుల వాహనాలు పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అలంపూర్-ర్యాలంపాడు తుంగభద్ర బ్రిడ్జి వద్ద సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా వచ్చి వెళ్లే వాహనాలను అక్కడి అధికారులు తనిఖీ నిర్వహిస్తున్నారు. అలంపూర్ మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు గురువారం ర్యాలంపాడు, సుల్తానాపురం, జిల్లెలపాడు గ్రామాలకు వెళ్లారు. ఈ క్రమంలో సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎమ్మెల్సీ వాహనాలను తనిఖీలు చేశారు.



అలంపూర్ వద్ద ఎమ్మెల్సీ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా ప్రచారం..

బీఆర్ఎస్‌తోనే గ్రామాలాభివృద్ధి

అలంపూర్ రూరల్/అయిజ: బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని కాశీపూర్, శింగవరం-1, శింగవరం-2, ర్యాలంపాడ్, సుల్తాన్‌పూర్, జిల్లెలపాడ్, గొందిమల్ల, భీమవరం, క్యాతూర్, లింగన్‌వాయి గ్రామాలలో ఎమ్మెల్సీ చల్లా బలపరిచిన బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు ప్రచారం నిర్వహించారు. విజేయుడితో పాటు ఎమ్మెల్సీ చల్లా ప్రచారంలో పాల్గొని మాట్లాడారు.

అయిజలో బీఆర్ఎస్ నేతల ప్రచారం

అయిజ పట్టణంలోని వివిధ కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడుని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అపోహలు నమ్మొద్దు

శాంతినగర్: కర్ణాటకలో ఉచిత విద్యుత్ ఫెయిల్యూర్ అయిందని కొందరు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని అలాంటి వారి మాటలు నమ్మవద్దని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో కర్ణాటక విద్యాశాఖ మంత్రి డా.ఎంసీ సుధాకర్, చెల్లగేర శాసన సభ్యులు రఘుమూర్తితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

బీఆర్ఎస్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు

శాంతినగర్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఓటములకు మాదిగల ఓట్లు కీలకమని, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించామని, అలంపూర్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడానికి కృషిచేస్తామని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర హుస్సేన్ మాదిగ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు.

విలువలు పాటించాలి

అయిజ: మండలంలో విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారని, విలువలు పాటించాలని కాంగ్రెస్ నాయకుడు దివంగత ఉత్తనూరు తిరుమలరెడ్డి కుమారుడు గౌతంరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

కుటుంబ పాలనలో అభివృద్ధి శూన్యం

గద్వాల అర్బన్: కుటుంబ పాలనలో అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 2,3, 34, 35వ వార్డుల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను ఆశీర్వాదించాలని కోరారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

ధరూరు: బహుజన నాయకుడికి ఒక్క అవకాశం ఇచ్చి గద్వాల కోటపై బహుజన జెండా ఎగరవేసేందుకు సహకరించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి గొంగ్ల రంజిత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మండల నాయకులతో కలిసి మండల మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

రాజోళి: అలంపూర్ అభివృద్ధి జరగాలంటే బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం రాజోళిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

రాజోళి: కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే పేదలకు పథకాలు అందుతాయని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం రాజోళిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్ తరుపున ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

పుష్కరఘాట్లలో పొంచి ఉన్న ప్రమాదం



బీచుపల్లి పుష్కరఘాట్ దగ్గర పూర్తిగా కొట్టుకుపోయిన రక్షణ కంచె

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇనుప కంచె
- ప్రమాదాల భారిన పడుతున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదం కొనితెచ్చుకుంటున్న యువత (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కృష్ణానది వద్ద పుష్కరఘాట్లలో భక్తుల రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచె వరదల కారణంగా పూర్తిగా ధ్వంసమై కొట్టుకుపోయింది. దీంతో పుష్కరఘాట్లు భక్తులకు ఎలాంటి రక్షణ లేకుండా మారాయి. పుష్కరఘాట్లు నిత్యం ప్రమాదాలకు తావిస్తుండడంతో అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. ఎండాకాలంలో జరిగే బీచుపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలతో పాటు వినాయక నిమజ్జనం ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. పుష్కరఘాట్లలో సరైన భద్రత లేకపోవడంతో ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఎన్ని ప్రమాద ఘటనలు జరిగినా అధికారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం భక్తుల రాక..

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అభయాంజనేయస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, జ్ఞాన సరస్వతి ఆలయంతో పాటు శివాలయం వంటి ప్రముఖమైన ఆలయాలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో భక్తులు బీచుపల్లి క్షేత్రానికి వస్తుంటారు. వచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాలలో మొక్కులు తీర్చుకుంటారు. పుష్కరఘాట్లలో స్నానాలు చేసే దగ్గర, కృష్ణమ్మ విగ్రహం దగ్గర రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచె సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. ప్రతి ఏటా బీచుపల్లి జాతర సమయంలో, వినాయక నిమజ్జనం సమయంలో భక్తులు వేల సంఖ్యలో రావడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.

ప్రమాదాల బారిన పడుతున్నారు..



పుష్కరఘాట్ దగ్గర ఇనుప కంచె సక్రమంగా లేకపోవడంతో యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం రోజు రాత్రివేళల్లో భక్తులు అధికంగా వస్తుంటారు దీంతో రక్షణగా ఇనుప కంచె లేకపోవడంతో గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు యువకులు పుష్కరఘాట్లలో సెల్ఫీలను దిగుతూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదంలో పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు.

– నరేష్, భక్తుడు

రక్షణ కంచె ఏర్పాటు చేయాలి..



పుష్కరఘాట్లలో వరదల కారణంగా భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెలు పూర్తిగా కొట్టుకు పోవడం వల్ల భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అమావాస్య, శనివారం, ఆదివారం రోజుల్లో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు కుటుంబసమేతంగా వస్తుంటారు. భక్తుల రక్షణ కోసం తక్షణమే అధికారులు ఇనుప కంచెను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, భక్తుడు

అధికారులకు విన్నవించాం..



పుష్కరఘాట్లలో ఇనుప కంచె లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా అధికారులకు విన్నవించాం. ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రమాదాలు మాత్రం తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలి.

– నర్సమ్మ, సర్పంచ్, బీచుపల్లి

పర్దీపురాన్ని గ్రామ పంచాయతీ చేయాలి

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురం గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం పర్దీపురంలో బ్యానర్లు పట్టుకొని ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడారు. పర్దీపురం గ్రామం అయిజ మున్సిపాలిటీ పరిధిలో ఉండడం వల్ల సరిపడినన్ని నిధులు కేటాయించడంలేదని, దానివల్ల గ్రామం అభివృద్ధి చెందడం లేదన్నారు. ప్రజలు వద్దన్నా డంపింగ్ యార్డు గ్రామ సమీపంలో ఏర్పాటు చేశారన్నారు. వ్యతిరేకించిన రైతులపై కేసులు పెట్టి, కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పర్దిపురం గ్రామస్తులు చంద్రన్న, రామకృష్ణ, కుమార్, జగదీష్, శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పర్దీపురం గ్రామస్తులు

ఘనంగా సత్యప్రమోద తీర్థ స్వామి ఆరాధన



గద్వాలన్యూటౌన్: జిల్లా కేంద్రంలోని ఉత్తరాదిమఠంలో గురువారం సత్యప్రమోద తీర్థ స్వాముల వారి మధ్య ఆరాధన ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తి పార్యవశంతో వేదండితులు సాంప్రదాయబద్ధంగా కార్యక్రమం చేశారు. మఠంలోని ఆలయంలో ఉత్తరముఖ ఆంజనేయస్వామికి, సత్యప్రమోద స్వాముల వారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు వామనాచార్య, పండితులు జయతీర్థాచార్య, సత్యపూర్ణచార్య, మాజీ కౌన్సిలర్ భీమ్‌సేన్‌రావ్, మఠాధికారి ప్రహ్లాదచార్య, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్‌కు చెందిన తెలుగు నాగన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు గురువారం షాబాద్‌కు చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి సూచన మేరకు రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. సేవాదళం సభ్యులు సంజన్న, ఎల్లప్ప, మదుసూదన్‌రెడ్డి, పరుష, రామకృష్ణ ఉన్నారు.

బహుమతుల అందజేత



గద్వాల అర్బన్/మల్దకల్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ సిద్దార్థ యోగ విద్యాలయం రామచంద్ర చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి మొదటి బహుమతి అమరవాయి జెడ్పీహెచ్ఎస్ కేశవర్ధన్, రెండో బహుమతి తాటికుంట ఎంపీపీహెచ్ఎస్ ప్రవీణ్, మూడో బహుమతి అలంపూర్ జెడ్పీహెచ్ఎస్ అఫ్రీయ అంజుమ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్, ఎన్‌టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ ఉన్నారు.